

తూప్రాన్ మండలం ఇస్లాంపూర్‌లో మొక్కను నాటి నీరు పోస్తున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

జిల్లాలో 34 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యం

- వనమహోత్సవంలో ఒకేరోజు 2 లక్షల మొక్కలు
- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

తూప్రాన్/రామాయంపేట, ఆగస్టు 9: స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం చివరి రోజు నిర్వహించిన వనమహోత్సవంలో మెదక్ జిల్లాలో 2 లక్షల మొక్కలు నాటాలని నిర్దేశించినట్టు కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. తూప్రాన్ మండలం ఇస్లాంపూర్, రామాయంపేట మండల కేంద్రంలో నిర్వహించిన స్వచ్ఛదనం-పచ్చదనం ముగింపులో ఆయన పాల్గొన్నారు. ఆదర్శ గ్రామం మల్కాపూర్ రాక్‌గార్డెన్‌లో, తూప్రాన్ పట్టణంలోని జూనియర్ కళాశాల, సీహెచ్‌సీ ఆస్పత్రిలో, రామాయంపేటలోని గురుకులంలో మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ ఈ ఏడాది వనమహోత్సవంలో భాగంగా జిల్లావ్యాప్తంగా 34 లక్షల మొక్కలను నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇప్పటి వరకు 80 శాతం మొక్కలు నాటామని తెలిపారు. వనమహోత్సవంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మొక్కలు నాటడమే కాకుండా సంరక్షించే బాధ్యత తీసుకోవాలని పేర్కొన్నారు. ఆరోగ్య మెదక్ జిల్లా సాధనే లక్ష్యంగా గత వారం స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం నిర్వహించినట్టు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో సీహెచ్ ఎల్లయ్య, జిల్లా అటవీశాఖ అధికారి జోజి, డీఆర్డీఈవో చెన్నమనేని శ్రీనివాస్‌రావు, తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి, జిల్లా విద్యాధికారి రాధాకిషన్, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, తూప్రాన్ మున్సిపల్ చైర్‌పర్సన్ మామిండ్ల జ్యోతికృష్ణ, ఎంపీడీవో శేషాద్రి, డాక్టర్ అమర్ సింగ్, రామాయంపేటలో మున్సిపల్ చైర్మన్ జితేందర్, భాదె చంద్రం, కౌన్సిలర్ చిలుక గంగాధర్ పాల్గొన్నారు.

స్వాతంత్ర్య దినోత్సవానికి పక్కాగా ఏర్పాట్లు

మెదక్ అర్బన్, ఆగస్టు 9: స్వాతంత్ర్యదిన వేడుకలను ఘనంగా నిర్వహించాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో స్వాతంత్ర దినోత్సవ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సదర్భంగా మాట్లాడుతూ ఆగస్టు 15న ఉదయం 9 గంటలకు జిల్లా పోలీసు కార్యాలయం మైదానంలో నిర్వహించే వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సూచించారు. స్వాతంత్ర సమరయోధులను ఆహ్వానించాలని, ఆయా శాఖల శకటాలు ప్రదర్శించాలని పేర్కొన్నారు. అనంతరం స్థానిక సంస్థల ఎన్నికలపై సమీక్షిస్తూ రిజర్వేషన్లపై తదుపరి ఆదేశాలు వచ్చేంత వరకు గ్రామ, మండలస్థాయిలో సమాచారాన్ని సేకరించాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, అదనపు ఎస్పీ మహేందర్, ఆర్డీవో రమాదేవి, జడ్పీ సీఈవో ఎల్లయ్య, డీపీవో యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

నాగుల పంచమి శోభ

- శివాలయాలకు పోటెత్తిన భక్తులు
- పుట్టల్లో పాలు పోసి పూజలు

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 9: శ్రావణమాసం మొదటి శుక్రవారం వచ్చే నాగుల పంచమి సందర్భంగా జిల్లాలో ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి. శివుడి ఆభరణమైన నాగేశ్వరుడికి నైవేద్యంగా పుట్టల్లో పాలుపోసి పూజలు చేశారు. రామచంద్రాపురం, పటాన్‌చెరు, సదాశివపేట, జహీరాబాద్, అందోల్, నారాయణఖేడ్ తదితర పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఆలయాలకు భక్తులు నాగదేవతలకు పాలు పోసి నాగదోషాలు తొలగించుమని పూజలు చేశారు. సంగారెడ్డి పట్టణంలోని వినాయక్‌సాగర్ చెరువు కట్టపై ఉన్న నాగదేవత ఆలయ ఆవరణలోని పుట్టలో పాలు పోసేందుకు మహిళలు, యువతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పోతిరెడ్డిపల్లి చౌరస్తాలోని శివాలయం, రాజంపేటలోని రాజరాజేశ్వరాలయం, కల్పగూర్ గ్రామంలోని కాశీవిశ్వేశ్వరాలయాల్లోని పుట్టల్లో పాలు పోసి నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహిళలు పసుపుకుంకుమ ఇచ్చిపుచ్చుకున్నారు. వాయినాలు సమర్పించుకున్నారు. ఆలయాల నుంచి ఇంటికి వెళ్లే దారి పొడవునా జొన్న ప్యాలాలను చల్లుకుంటూ ఇళ్లకు చేరుకున్నారు.





సంగారెడ్డిలో..

వరి నాట్లు అంతంతే..

- మొహం చాటేసిన వర్షాలు
- అదను దాటుతున్నా పూర్తవని వరినాట్లు
- భారీగా తగ్గిన సాగు విస్తీర్ణం
- వరి సాగు అంచనా 3.10 లక్షల ఎకరాలు
- ఇప్పటి వరకు నాట్లు వేసింది 1.22 లక్షలు
- 2 లక్షల ఎకరాలు దాటడమూ కష్టమే..



మెదక్, ఆగస్టు 8: మెదక్ జిల్లాలో వరుణుడు మొహం చాటేశాడు. రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురుస్తుండగా.. జిల్లాలో మాత్రం ఇప్పటికీ జలవనరులు బోసిపోతున్నాయి. భూగర్భ జలమట్టాలు ఏమాత్రం పెరగలేదు. చెరువులు, కుంటల్లోకి కొత్త నీరు చేరలేదు. వానాకాలం రెండు నెలలు గడిచినా ఇప్పటికీ నాట్లు అంతంతమాత్రమే పడ్డాయి. దీంతో, వరి సాగు గణనీయంగా తగ్గిపోయింది. మెతుకుసీమగా పేరుగాంచిన మెదక్ జిల్లాలో చెరువులు, కుంటలు, బోర్లపై ఆధారపడి రైతులు పంటలు సాగు చేస్తారు. జిల్లాలో ఘనపురం ప్రాజెక్టు ఉన్నా ఎక్కువ సాగు వర్షాధారంగానే చేస్తారు. ఈసారి వానాకాలం తీవ్ర వర్షాభావంతో చెరువులు, కుంటలు నీరు లేక బోసిపోతున్నాయి. జిల్లాలో సాధారణంగా 3.10 లక్షల ఎకరాల్లో నాట్లు వేస్తారనని అంచనా వేయగా.. 1.22 లక్షల ఎకరాల్లో మాత్రమే ఇప్పటి వరకు నాట్లు వేశారు. మరో వారంలో నాట్లు వేయడానికి అదను దాటుతుంది. అప్పటి వరకు మరో 80 వేల ఎకరాల్లో నాట్లు పడే అవకాశం ఉన్నట్టు అంచనా వేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా మూడొంతుల మండలాల్లో వర్షాభావం నెలకొంది. ఘనపురం ఆయకట్టు తప్ప ఇతర ప్రాంతాల్లో సాగు తక్కువగా ఉంది.

సీజన్ ప్రారంభమై రెండు నెలలు

సీజన్ ప్రారంభమై రెండు నెలలు గడిచిపోయాయి. వానాకాలం సాధారణ వరి సాగులో సగం కూడా నాట్లు పడలేదు. జిల్లాలో అత్యధికంగా పాపన్నపేటలో 13,448 ఎకరాల్లో వరి నాట్లు వేసుకోగా.. అత్యల్పంగా రేగోడ్ మండలంలో 200 ఎకరాల్లో మాత్రమే వరిసాగు చేస్తున్నారు. మండలాలవారీగా (ఎకరాల్లో..) చిలప్‌చెడ్ 4,674, కౌడిపల్లి 8,162, కొల్చారం 8,786, హవేళీఘనాపూర్ 5,329, మెదక్ 11,851, చిన్నశంకరంపేట 6,871, మనోహరాబాద్ 1,627, నర్సాపూర్ 7,389, శివంపేట 4,306, తూప్రాన్ 1,611, అల్లాదుర్గం 1,270, చేగుంట 6,432, నార్సింగి 3,394, నిజాంపేట 6,713, పెద్దశంకరంపేట 4,377, టేక్మాల్ 5,456 ఎకరాల్లో ఇప్పటివరకు వరి పంట వేసుకున్నట్టు వ్యవసాయశాఖ గణాంకాలను వెల్లడిస్తున్నాయి. ఈ దశలో రైతులు ప్రత్యామ్నాయ ఆరుతడి పంటలు వేసుకోవడమే ఉత్తమమని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

ఆరుతడి పంటలే మేలు..

అదను దాటుతుండడంతో రైతులు ఆరుతడి పంటల సాగుపై దృష్టిసారిస్తున్నారు. ఇప్పటి వరకు జిల్లాలో పత్తి 36,155 ఎకరాలు, జొన్న 2,922, మొక్కజొన్న 122, సోయా 92, చెరుకు 14, మినుములు 274, పెసలు 977, కందులు 729 ఎకరాల్లో సాగు చేస్తున్నట్టు వ్యవసాయాధికారులు లెక్కతేల్చారు. రేగోడ్, అల్లాదుర్గం, పెద్దశంకరంపేట, టేక్మాల్, మండలాల్లో అధిక విస్తీర్ణంలో పత్తి సాగవుతున్నట్టు గణాంకాలు తెలుపుతున్నాయి.

పరిశుభ్రతతో సీజనల్ వ్యాధులకు చెక్

- సంగారెడ్డి కలెక్టర్ వల్లూరి క్రాంతి
- పటాన్‌చెరు ఏరియా ఆసుపత్రి ఆకస్మిక తనిఖీ



పటాన్‌చెరు ఆసుపత్రిలో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ క్రాంతి

పటాన్‌చెరు, ఆగస్టు 9: సంపూర్ణ పరిశుభ్రతతోనే సీజనల్ వ్యాధులకు చెక్ పెట్టగలమని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరి క్రాంతి పేర్కొన్నారు. స్వచ్ఛదనం-పచ్చదనం ముగింపు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆమె జీహెచ్‌ఎంసీ పరిధిలోని పటాన్‌చెరు, రామచంద్రాపురం డివిజన్లలో పర్యటించారు. పటాన్‌చెరు ఏరియా ఆసుపత్రిని తనిఖీ చేశారు. సీజనల్ జ్వరాలతో ఆసుపత్రికి వస్తున్న వారి సంఖ్యపై ఆరా తీశారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్యసేవలపై సూపరింటెండెంట్ శ్రీనివాస్‌ను అడిగి తెలుసుకున్నారు. డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, చికెన్‌గున్యా, వైరల్ జ్వరాలతో వచ్చే వారికి మెరుగైన చికిత్స అందించాలని కలెక్టర్ ఆదేశించారు. ఆసుపత్రి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, రోగుల కుటుంబ సభ్యులకు పారిశుధ్యంపై అవగాహన కల్పించాలని సూచించారు. పట్టణంలో చెత్త ఆరుబయట వేయకుండా జీహెచ్‌ఎంసీ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దోమల నివారణపై దృష్టి సారించాలని, ఫాగింగ్, ఆయిల్ బాల్స్ వేయడం చేయాలని సూచించారు. అనంతరం పటాన్‌చెరు పెద్దచెరువు, రామచంద్రాపురం రాయసముద్రం చెరువుల్లో కార్పొరేటర్లు మెట్టు కుమార్‌యాదవ్, పుష్పనగేష్‌లతో కలిసి ఆయిల్‌బాల్స్ వదిలారు. ప్రభుత్వ అతిథిగృహం ఆవరణలో మొక్కలు నాటారు.



నెలవారీ నేరసమీక్షలో మాట్లాడుతున్న మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు

పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలి

కేసుల విచారణ ప్రణాళికబద్ధంగా చేపట్టాలి

నేర సమీక్షలో మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మెదక్ అర్బన్, ఆగస్టు 9: ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించాలని మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి సూచించారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నెల వారి నేర సమీక్షను శుక్రవారం ఆయన నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో ఎక్కువ నేరాలు జరిగే ప్రాంతాలను గుర్తించి హాట్‌స్పాట్లుగా ప్రకటించాలని సూచించారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి క్రైం మ్యాపింగ్ తయారు చేసి, నేరాల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలను సిబ్బందికి తెలియజేశారు. ఫోక్సో కేసుల్లో బాధితులకు న్యాయం జరిగేలా విచారణ చేయాలని సూచించారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. విధులు నిర్వహించే సిబ్బందికి పలు సూచనలు చేస్తూ.. పనితనాన్ని మరింత మెరుగుపరచాలని అధికారులకు సూచించారు. కేసు నమోదు చేయడం నుంచి చార్జిషీట్ దాఖలు చేసేవరకు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు అవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో అదనపు ఎస్పీ మహేందర్, తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, సైబర్ క్రైం డీఎస్పీ సుభాష్‌చంద్రబోస్, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

జీహెచ్‌ఎంసీ వద్దు.. పంచాయతీనే ముద్దు

- 45 గ్రామాల విలీనంపై వ్యతిరేకత
- పన్నుల భారం పెరుగుతుందని ఆందోళన
- న్యాయపోరాటానికి సన్నాహాలు!

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 9: హైదరాబాద్ నగర శివార్లలోని కొన్ని గ్రామాలతో పాటు పురపాలికలను జీహెచ్‌ఎంసీలో విలీనం చేయాలని తీసుకున్న నిర్ణయం పట్ల కొన్ని ప్రాంతాల ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. హైదరాబాద్ మహానగరాన్ని మరింత విస్తరించేందుకు ఔటర్ రింగురోడ్డుకు ఆనుకుని ఉన్న 45 గ్రామాలను ముందుగా సమీప పురపాలికల్లో విలీనం చేసి ఈ తరువాత గ్రేటర్‌లో కలిపేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్న విషయం తెలిసిందే. అయితే, సర్కార్ నిర్ణయంపై స్థానికంగా ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ప్రభుత్వ నిర్ణయంపై న్యాయస్థానాన్ని ఆశ్రయించేందుకు కొందరు సిద్ధమవుతున్నారు. శివార్లలోని గ్రామ పంచాయతీలు, పురపాలికలను విలీనం చేయడంతో లక్షలాది మందిపై పన్నులు, వాటర్ బిల్లుల భారం పెరగనుంది. ఇంటి పన్నుతో పాటు వాటర్ బిల్లులు పెరుగుతాయి. ఇప్పటికీ అనేక గ్రామాల్లో సరైన మౌలిక సదుపాయలు లేవు. ఇటీవల కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లలో కూడా ఇప్పటి వరకు మౌలిక సదుపాయాలు లేవు. అలాంటిది పంచాయతీలను విలీనం చేస్తే తమకు కొత్తగా ఒనగూరిదే ఏమీ ఉండదని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పలు గ్రామాల ప్రజలు అధికారులను కలిసి తమ గ్రామాన్ని జీహెచ్‌ఎంసీలో విలీనం చేయవద్దని యథావిధిగా కొనసాగించాలని వినతిపత్రాలు అందజేస్తున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం పల్లెల్లో ఎలాంటి మౌలిక సదుపాయాలు కల్పించకుండానే ఏడాది కాలంలోనే జీహెచ్‌ఎంసీలో 45 గ్రామాలను విలీనం చేయాలని నిర్ణయించడంపై విమర్శలు వస్తున్నాయి. అలాగే శివార్లలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను జీహెచ్‌ఎంసీలో విలీనం చేయడంపై కూడా కొన్ని ప్రాంతాల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ప్రతిపక్ష బీఆర్ఎస్ కూడా దీనిపై వివరాలు సేకరిస్తున్నది. అధికార పార్టీకి చెందిన స్థానిక నేతలు కూడా సర్కార్ నిర్ణయంపై బహిరంగంగా మాట్లాడకపోయినప్పటికీ దీన్ని వ్యతిరేకిస్తున్నారు. ప్రభుత్వం మాత్రం ఔటర్‌కు ఆనుకుని ఉన్న 45 గ్రామపంచాయతీల్లో ఎన్నికల పక్రియ నిలిపివేసి వీటిని పురపాలక సంఘాల్లో విలీనం చేసే పక్రియను దాదాపు పూర్తి చేసింది. పురపాలికల్లో విలీనమయ్యే గ్రామాలు మేడ్చల్ జిల్లా పరిధిలో అధికంగా ఉన్నాయి. మేడ్చల్ జిల్లాలో 23 గ్రామాలను 7 పురపాలికల్లో, రంగారెడ్డి జిల్లాలోని 4 పురపాలికల్లో 11 గ్రామాలను విలీనం చేస్తున్నారు. సంగారెడ్డి జిల్లాలోని రెండు పురపాలికల్లో 11 గ్రామాలు విలీనం కానున్నాయి.

డబుల్‌బెడ్రూం ఇళ్ల నిర్మాణంపై సమీక్ష నిర్వహిస్తాం : అదనపు కలెక్టర్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నారాయణఖేడ్, ఆగస్టు 9: నారాయణఖేడ్ శివార్లలో నిర్మించిన డబుల్‌బెడ్‌రూం గృహాలపై 'గృహ ప్రవేశానికి ముందే శిథిలావస్థకు' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి సంగారెడ్డి అదనపు కలెక్టర్ స్పందించారు. ఇళ్ల స్థితిగతులపై సమీక్ష నిర్వహిస్తామని శుక్రవారం ఆయన ఓ ప్రకటనలో వెల్లడించారు. జూక్కల్ శివారులో 795 డబుల్ బెడ్రూం ఇళ్లను నిర్మాణ పనులు 2015–17 మధ్య మొదలయ్యాయని, ఇప్పటి వరకు 130 గృహాల నిర్మాణం పూర్తయ్యిందని తెలిపారు. పలువు కాంట్రాక్టర్లు వివిధ బ్లాకుల్లో పనులు నిర్వహిస్తున్నారని చెప్పారు. ఆయా బ్లాకులు వివిధ దశల్లో ఉన్నాయని వెల్లడించారు. అందోల్ పంచాయతీ రాజ్ డివిజన్ కార్యాలయ నివేదిక ప్రకారం 130 గృహాలు మినహా, మిగతా గృహాలకు సంబంధించిన పనులు ఏడాదిగా నిలిచిపోయాయని తెలిపారు. దీనిపై కాంట్రాక్టర్లతో అందోల్ పీఆర్ఈఈ సమీక్ష సమావేశం నిర్వహిస్తారని తెలిపారు.

గంజాయి రవాణా కేసులో ఇద్దరికి పదేళ్ల జైలు

నారాయణఖేడ్, ఆగస్టు 9 : కంగ్టి మండలం వాసర్ బిబ్యానాయక్ తండాకు చెందిన జాదవ్ బల్‌రాం, నాగల్‌గిద్ద మండలం ఇరక్పల్లికి చెందిన జాదవ్ మారుతి 2015 మార్చిలో 180 కిలోల ఎండు గంజాయిని తరలిస్తుండగా పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేశారు. దీనికి సంబంధించి జిల్లా ఆడిషనల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఒక్కొక్కరికి పదేళ్ల జైలు శిక్ష, రూ.లక్ష చొప్పున జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారని ఎక్సైజ్ సీఐ రఘునాథ్‌రెడ్డి శుక్రవారం తెలిపారు.

అకడమిక్ డీఎంఈ రాజీనామా!

- ఆ పోస్టు తనకొద్దంటూ సర్కారుకు శివరాంప్రసాద్ లేఖ
- కొత్త వైద్య కళాశాలలకు అనుమతులు తేవాల్సిందేనని ఉన్నతాధికారుల ఒత్తిడి!
- అది భరించలేకనే తప్పుకొన్న శివరాం?

హైదరాబాద్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): వైద్యవిద్య అకడమిక్ సంచాలకుడు డాక్టర్ శివరాంప్రసాద్ తన పదవికి రాజీనామా చేశారు. తనను ఆ పోస్టు నుంచి తప్పించాలని కోరుతూ ప్రభుత్వానికి లేఖ రాశారు. తాను అకడమిక్ డీఎంఈగా విధులు నిర్వహించలేని పరిస్థితుల్లో ఉన్నానని లేఖలో పేర్కొన్నట్లు తెలుస్తోంది. వైద్యవిద్య సంచాలకుల పరిధిలో జరిగిన సాధారణ బదిలీల కంటే ముందే ఆయన సర్కారుకు రాజీనామా లేఖను పంపినట్లు తెలుస్తోంది. అయితే ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గత కొద్ది రోజులుగా ఆయన డీఎంఈ కార్యాలయానికి కూడా రావడం లేదు. వైద్యవిద్య అకడమిక్ సంచాలకుడిగా తీవ్రమైన పనిభారం, ఉన్నతాధికారుల ఒత్తిడి తట్టుకోలేకనే ఆ పోస్టు నుంచి తప్పుకొన్నారని శివరాంప్రసాద్ సన్నిహితులు చెబుతున్నారు. ప్రస్తుతం కొత్తగా 8 వైద్య కళాశాలల్లో ఈ ఏడాది నుంచి ప్రవేశాలను చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. కానీ, అధ్యాపకులు, సౌకర్యాల లేమి కారణంగా 8 కాలేజీలకు జాతీయ వైద్య మండలి అనుమతి ఇవ్వలేదు. దీనిపై డీఎంఈ కార్యాలయం అప్పీలుకు వెళ్లగా.. నాలుగింటికి అనుమతులు వచ్చాయి. మరో నాలుగు పెండింగ్‌లో ఉన్నాయి. ఎలాగైనా సరే వాటికి అనుమతులు తీసుకురావాల్సిందేనని ఉన్నతాధికారులు డీఎంఈ కార్యాలయంపై ఒత్తిడి తీసుకొచ్చారు. అది భరించలేకనే ఆయన అకడమిక్ డీఎంఈ పదవి నుంచి వైదొలగినట్లు తెలుస్తోంది.

పెద్దాపూర్ గురుకులంలో విద్యార్థి మృతి

- అర్ధరాత్రి ఇద్దరు విద్యార్థులకు అస్వస్థత
- తెల్లవారుజామున ఆస్పత్రికి తరలింపు
- ఒకరి మృతి.. మరొకరి పరిస్థితి విషమం
- టీచర్ల నిర్లక్ష్యమేనని బంధువుల ఆరోపణ

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు, 9: అర్ధరాత్రి అస్వస్థతకు గురైన ఇద్దరు గురుకుల విద్యార్థులను తెల్లవారుజామున ఆస్పత్రికి తరలించగా.. పరిస్థితి విషమించి ఒకరు మృతి చెందగా.. మరొకరు ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్నారు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలంలోని పెద్దాపూర్ క్యాంపులోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో ఈ ఘటన చోటు చేసుకుంది. సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలోని బొప్పాపూర్ గ్రామానికి చెందిన ఎలమాడల అనిరుధ్ (11), జగిత్యాల జిల్లా మెట్‌పల్లికి చెందిన మొండి మోక్షిత్ గురుకులంలో ఆరోతరగతి చదువుతున్నారు. వీరిద్దరూ గురువారం రాత్రి తోటి విద్యార్థులతో కలిసి నిద్రపోయారు. అయితే అర్ధరాత్రి సమయంలో అస్వస్థతకు గురయ్యారు. శుక్రవారం ఉదయం 5.30 గంటల సమయంలో పీఈటీ వెళ్లగా.. కడుపు నొప్పిగా ఉందని అనిరుధ్, మోక్షిత్‌లు తెలిపారు. దీంతో వెంటనే కేర్‌టేకర్‌లు, అనిరుధ్ తల్లికి ఫోన్‌లో సమాచారం ఇచ్చి వారిని కోరుట్ల ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు చికిత్స అనంతరం విషమంగా ఉందని తెలపడంతో వెంటనే జిల్లా కేంద్రంలోని ఆస్పతికి తీసుకెళ్లారు. అప్పటికే విషయం తెలిసి వైద్యుడు కూడా అయిన కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్.. విద్యార్థులు పాము కాటుకు గురై ఉండవచ్చని అందుకు తగిన వైద్యం చేయాలని ఆర్మూర్‌లో వైద్యులకు సూచించారు. అక్కడ వైద్యం అందించి నిజామాబాద్ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే అనిరుధ్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మోక్షిత్ పరిస్థితి కూడా విషమంగా ఉండడంతో చికిత్స అందిస్తున్నారు. ఇటు పాఠశాలలో ప్రార్థనా సమయంలోనే ఆరో తరగతి చదువుతున్న హేమంత్ అనే మరో విద్యార్థి కూడా కళ్లు తిరుగుతున్నాయని కింద పడిపోయాడు. గమనించిన ఉపాధ్యాయులు మెట్‌పల్లి ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. కాగా, 2 వారాల క్రితం ముగ్గురు విద్యార్థులు ఇదే విధంగా అస్వస్థతకు గురయ్యారు. వీరిలో చికిత్స అనంతరం ఇద్దరు కోలుకోగా.. 8వ తరగతి చదివే ఆర్.గణాధిత్య (13) మృతి చెందాడు. అయితే వీరు పాము కాటుకు గురైనట్లు సమాచారం.


అనిరుధ్ (ఫైల్)

ఎమ్మెల్యే సంజయ్ ఆగ్రహం..

విద్యార్థి అనిరుధ్ మృతి విషయం తెలిసి కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ గురుకులానికి చేరుకున్నారు. విద్యార్థి మృతికి కారణాలేంటని అక్కడి ఉపాధ్యాయులు ప్రశ్నించారు. అయితే తమకేం తెలియదని వారు సమాధానం చెప్పడంతో ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు, విద్యార్థుల వరుస మరణాలకు ఉపాధ్యాయుల నిర్లక్ష్యమే కారణమని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పాఠశాలలో వసతులు సరిగా లేవని.. తమ పిల్లల భద్రత మాటేంటని అధికారులను ప్రశ్నిస్తున్నారు.

ప్రాణం తీసిన ఇన్‌స్టా స్నేహం

- ప్రేమ పేరిట యువకుడి వేధింపులు.. బీఫార్మసీ విద్యార్థిని ఆత్మహత్య

గుమ్మడిదల, ఆగస్టు 9: ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన వ్యక్తితో చేసిన స్నేహం ఓ యువతి ప్రాణాలు తీసింది. ప్రేమ పేరుతో ఆ యువకుడి వేధింపులు భరించలేక ఓ బీఫార్మసీ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. తమ ఇంటి భవనంపై నుంచి దూకి బలవన్మరణానికి పాల్పడింది. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం దోమడుగు గ్రామంలో గురువారం రాత్రి ఈ ఘటన జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. దోమడుగు గ్రామానికి చెందిన రాజు, సోనీ దంపతులకు ఓ కుమారుడు, కుమార్తె తేజస్విని(20) ఉన్నారు. బీఫార్మసీ సెకండియర్ చదువుతున్న తేజస్వినికి అదే గ్రామానికి చెందిన శ్రీహరి కొద్ది రోజుల క్రితం ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమయ్యాడు. కొద్ది రోజుల తర్వాత తనను ప్రేమించాలని, పెళ్లి చేసుకోవాలని శ్రీహరి వేధించడం మొదలుపెట్టాడు. ఇదే విషయమై తేజస్విని కుటుంబసభ్యులను కూడా బెదిరించాడు. దీంతో తేజస్విని ఇంట్లో నాలుగు రోజుల క్రితం కూడా గొడవ జరిగింది. ఈ క్రమంలో శ్రీహరి వేధింపులు తాళలేకపోయిన తేజస్విని గురువారం రాత్రి తమ ఇంటి భవనం మూడో అంతస్తు నుంచి దూకేసింది. రక్తపుమడుగులో పడి ఉన్న తేజస్వినిని కుటుంబసభ్యులు హుటాహుటిన సూరారంలోని మల్లారెడ్డి ఆస్పత్రికి తరలించగా అక్కడ మరణించింది.


తేజస్విని (ఫైల్)

పీర్జాదిగూడ కార్పొరేషన్ హస్తగతం

పీర్జాదిగూడ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఖాతాలోకి మరో మునిసిపల్ కార్పొరేషన్ చేరింది. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పీర్జాదిగూడ మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ జక్క వెంకటరెడ్డిపై కాంగ్రెస్ కార్పొరేటర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. కీసర ఆర్డీవో వెంకట ఉపేందర్‌రెడ్డి సమక్షంలో శుక్రవారం నగర పాలక మండలి సమావేశం జరిగింది. మొత్తం 26 మంది కార్పొరేటర్లు ఉండగా.. అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా 21 మంది ఓటు వేశారు. దీంతో మేయర్‌పై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గినట్లుగా ఆర్డీవో ఉపేందర్‌రెడ్డి ప్రకటించారు. త్వరలోనే మేయర్ ఎన్నికకు తేది ఖరారు అయ్యే అవకాశం ఉంది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మేడ్చల్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ.. పీర్జాదిగూడ మునిసిపల్ కార్పొరేషన్‌లో ఇప్పటి వరకు కొనసాగిన అరాచక పాలనకు తెరపడిందని అన్నారు. కాంగ్రెస్‌కు చెందిన 12వ డివిజన్ కార్పొరేటర్ అమర్‌సింగ్‌ను తమ మేయర్ అభ్యర్థిగా ప్రకటించారు.

పూడికతీతతో పూర్వస్థితి

ప్రాజెక్టులకు నష్టం వాటిల్లకుండా పూడిక తీయాలి

- వచ్చే ఇసుకతో ప్రభుత్వానికి ఆదాయం
- మట్టిని రైతులకు ఉచితంగా ఇవ్వాలి
- 14లోగా ప్రతిపాదనలు అందించాలి
- మంత్రివర్గ ఉపసంఘం ఆదేశం

హైదరాబాద్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ప్రాజెక్టులకు నష్టం వాటిల్లకుండా పూడికతీత పనులు చేపట్టాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి నేతృత్వంలోని మంత్రివర్గ ఉపసంఘం అధికారులను ఆదేశించింది. ప్రాజెక్టుల రక్షణలో ఎట్టిపరిస్థితుల్లోనూ రాజీ ఉండరాదని స్పష్టం చేసింది. ప్రాజెక్టులకు ఏటా వచ్చే భారీ వరదతోపాటు పూడిక కూడా వచ్చి చేరుతోందని తెలిపింది. దీంతో ప్రాజెక్టుల సామర్థ్యం తగ్గుతున్నందున.. పూడికతీతతో పూర్వస్థితిని పునరుద్ధరించాలని సూచించింది. శుక్రవారం సచివాలయంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన ఉపసంఘం సమావేశం జరిగింది. పూడికతీతకు ఏయే చర్యలు తీసుకోవచ్చనే దానిపై నీటిపారుదల, మైనింగ్ శాఖలు సమగ్ర నివేదిక రూపొందించి, 14లోగా అందించాలని మంత్రివర్గం ఆదేశించింది. పూడిక వల్ల డ్యామ్ సేఫ్టీ సమస్యలు తలెత్తడంతో పాటు ఆయకట్టు తగ్గిపోతోందని, తాగునీటి అవసరాలపైనా దీని ప్రభావం పడుతుందని మంత్రులు పేర్కొన్నారు. ప్రాజెక్టుల్లో పూడికతీతకు పర్యావరణ అనుమతి అవసరంలేదని కేంద్రం చెప్పినందున..దానికనుగుణంగా చర్యలు చేపట్టాలన్నారు. పూడికలో ఇసుక ఉంటే నిర్మాణ అవసరాలకు వినియోగించుకోవాలని, సారవంతమైన మట్టి ఉంటే రైతాంగానికి ఉచితంగా అందించాలని సూచించారు. పూడికను రైతులే స్వయంగా తీసుకెళ్లేలా విధివిధానాలు రూపొందించాలని ఆదేశించారు.


ప్రాజెక్టుల్లో పూడికతీతపై సచివాలయంలో సమావేశమైన మంత్రివర్గ ఉపసంఘం

35 టీఎంసీల నిల్వను కోల్పోయాయి!

మహారాష్ట్ర, రాజస్థాన్‌లో వాణిజ్య అవసరాలకు ప్రయోగాత్మకంగా కొన్ని ప్రాజెక్టుల్లోని పూడికను వినియోగించుకుంటున్నారని అధికారులు మంత్రివర్గ ఉపసంఘానికి తెలిపారు. యంత్రాల సహాయంతో డ్రెడ్జింగ్ చేస్తూ పూడిక తీస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో జాతీయ హైడ్రాలజీ ప్రాజెక్టు (ఎన్‌హెచ్‌పీ) కింద 14 ప్రాజెక్టుల్లో పూడికపై అధ్యయనం చేయించగా.. 220 టీఎంసీల సామర్థ్యం కలిగిన రిజర్వాయర్లు 35 టీఎంసీల నిల్వను కోల్పోయినట్లు తేలిందని నివేదించారు. ఏటా పూడిక తీతకు టెండర్లు పిలిచి ప్రైవేటు కాంట్రాక్టర్లకు అప్పగిస్తే.. ఇసుక తరలింపుతో ట్యాక్స్, సెస్, జీఎస్టీ, ఇతర రాయల్టీలతో ప్రభుత్వానికి ఆదాయం వస్తుందని అన్నారు. పూడిక వల్ల జలాశయాలు ఏటా 0-5 శాతం నిల్వలను కోల్పోతున్నాయని చెప్పారు. రాష్ట్రంలో 25 ఏళ్లకు పైగా నిండిన జలాశయాలున్నాయని, ప్రయోగాత్మకంగా కొన్నింట్లో పూడికతీత చేపట్టి.. ఆ తరువాత మొత్తం 159 జలాశయాల్లో అమలు చేస్తే ప్రయోజనం ఉంటుందని వివరించారు. సమావేశంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు, నీటిపారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్‌దాస్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ప్రాజెక్టులను మింగుతున్న పూడిక

ఏటా వరదల సమయంలో జలాశయాల్లోకి నీటితోపాటు పూడిక వచ్చిచేరుతుండడంతో ప్రాజెక్టుల సామర్థ్యం ఏయేటికాయేడు తగ్గిపోతోంది. ఈ పూడిక.. ప్రాజెక్టుల ఆయుష్షును కూడా తగ్గిస్తోంది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని నిజాంసాగర్‌ను 1923లో అప్పటి నిజాం ప్రభుత్వం నిర్మించగా... ఈ ప్రాజెక్టు 1967 నాటికీ 52.10 శాతం సామర్థ్యం కోల్పోయింది. అప్పట్లో నిజాంసాగర్‌కు ఎగువన ప్రాజెక్టులే లేకపోవడంతో వచ్చే వరద పూడికతో సహా జలాశయంలో చేరడంతో ప్రాజెక్టు సామర్థ్యం సగానికి పైగా తగ్గింది. ఇక ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 2016లో నిర్మించిన ర్యాలివాగు సామర్థ్యం 43.30 శాతం మేర తగ్గింది. శ్రీశైలం ప్రాజెక్టు 1976లో అందుబాటులోకి రాగా... 45 ఏళ్లలో పూడిక కారణంగా 29.96 శాతం మేర నీటినిల్వ సామర్థ్యం కోల్పోయింది. ఇక నాగార్జునసాగర్ 23.52 శాతం నిల్వ సామర్థ్యం తగ్గింది. మొత్తంగా రాష్ట్రంలో 929 టీఎంసీల సామర్థ్యం కలిగిన 159 భారీ రిజర్వాయర్లు ఉండగా.. 220 టీఎంసీల సామర్థ్యం కలిగిన 14 ప్రాజెక్టుల్లో పూడికపై అధ్యయనం చేయించారు. ఇందులో ఈ ప్రాజెక్టుల సామర్థ్యం 35 టీఎంసీల మేర కోల్పోయిందని గుర్తించారు. ప్రాజెక్టుల్లో పూడిక చేరకుండా చెక్‌డ్యామ్‌ల నిర్మాణం, నదీ తీర ప్రాంతాలు కోతకు గురికాకుండా మొక్కల పెంపకం వంటి చర్యలు తీసుకోవాలని అంతర్జాతీయ నిపుణులు సూచిస్తున్నా.. ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడంతో వాటిని పూడిక మింగుతోంది. ప్రధానమంత్రి కృషి సించాయ్ యోజన(పీఎంకేఎస్‌వై) మార్గదర్శకాల ప్రకారం ఒక టీఎంసీ సామర్థ్యం కలిగిన రిజర్వాయర్ నిర్మించాలంటే భూసేకరణ, నిర్మాణ ఖర్చులు కలిపి రూ.162 కోట్లు అవుతాయని లెక్క ఉంది. ఈ లెక్కన రాష్ట్రంలో ఎన్‌హెచ్‌పీ కింద అధ్యయనం చేసిన జలాశయాలు రూ.5670 కోట్ల మేర నష్టపోయాయి.

నిర్మల్ వాసి ఆడు జీవితం

- సౌదీలో ఒంటెల కాపరిగా నామ్‌దేవ్
- రక్షించాలంటూ సెల్ఫీ వీడియో
- టీజీఎండీసీ చైర్మన్ అనిల్ ట్వీట్‌తో భారత ఎంబసీ స్పందన
- నామ్‌దేవ్ ఆచూకీ గుర్తించిన అధికారులు

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

దళారుల మాటలు నమ్మి భారత్ నుంచి సౌదీ అరేబియా వెళ్లి ఎడారిలో ఒంటెల కాపరిగా పని చేసే ఓ వ్యక్తి దుర్భర జీవితం ఇతివృత్తంగా ఇటీవల ఆడు జీవితం అనే సినిమా వచ్చింది. తెలంగాణలోని నిర్మల్ జిల్లాకు చెందిన రాథోడ్ నామ్‌దేవ్(51) అనే వ్యక్తి ఆ సినిమాలో మాదిరిగా సౌదీ ఎడారిలో దుర్భర జీవితం గడుపుతున్నాడు. ఈ కష్టాల నుంచి రక్షించండి అని వేడుకుంటూ నామ్‌దేవ్ ఇటీవల సోషల్ మీడియాలో సెల్ఫీ వీడియో పెట్టడంతో ఈ విషయం బయటికొచ్చింది. నామ్‌దేవ్ పెట్టిన వీడియోకు స్పందన రావడంతో అతను స్వదేశానికి వచ్చే అవకాశం కనిపిస్తోంది. నిర్మల్ జిల్లా ముథోల్ మండలం రువ్వి గ్రామానికి చెందిన రాథోడ్ నామ్‌దేవ్ పెట్టిన వీడియోకు తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ(టీజీఎండీసీ) చైర్మన్ ఈరవత్రి అనిల్ స్పందించారు. నామ్‌దేవ్‌ను సురక్షితంగా స్వదేశానికి చేర్చాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రి, కువైత్‌లోని భారత ఎంబసీ అధికారులను ఎక్స్(ట్విటర్) ద్వారా కోరారు. దీంతో కువైత్‌లోని భారత ఎంబసీ అధికారులు నామ్‌దేవ్‌ను సంప్రదించారు. కువైత్ సరిహద్దులోని సౌదీ అరేబియా ఎడారిలో నామ్‌దేవ్ ఉన్నట్లు గుర్తించారు. చాలా కాలంగా గల్ఫ్‌లో ఉంటున్న నామ్‌దేవ్‌ను అతని యజమాని పది నెలల క్రితం సౌదీలోని ఒంటెల క్షేత్రానికి తరలించినట్లు తెలిసింది. కాగా, సౌదీ, కువైత్‌లోని ప్రవాసీయులు నామ్‌దేవ్‌ను సంప్రదించేందుకు యత్నించగా అతని ఫోన్ స్విచ్చాఫ్‌లో ఉంది. నామ్ దేవ్‌ను ఏ విధంగా స్వదేశానికి పంపిస్తారో తెలియాల్సి ఉంది.

పింఛన్ డబ్బు కోసం తల్లిని చంపిన తనయుడు

- మద్యం తాగేందుకు ఇవ్వలేదని ఉరేసిన కొడుకు


దుర్గవ్వ(ఫైల్)

నిజాంపేట, ఆగస్టు 9 : మద్యానికి బానిసైన ఓ కుమారుడు తాగేందుకు మద్యం డబ్బు ఇవ్వలేదని ఏకంగా కన్నతల్లినే చంపేశాడు. మెదక్ జిల్లా నిజాంపేట మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన ఈ ఘటన వివరాలు సీఐ వెంకటరాజగౌడ్, ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన చల్మేటి దుర్గవ్వ(76)కు దివ్యాంగ పింఛన్ వస్తుంది. ఆమె కుమారుడు రామచంద్రం బీడీ కంపెనీలో పని చేస్తాడు. భార్య కూలీ పని చేస్తుంది. వారి కుమారుడు కూడా ఆర్థికంగా ఆదుకుంటుంటాడు. అతను పని చేస్తే వచ్చే డబ్బు తాగుడుకు సరిపోక గురువారం రాత్రి మద్యం తాగేందుకు తల్లిని పింఛన్ డబ్బు అడిగాడు. ఆమె నిరాకరించడంతో ఆవేశానికి గురై అర్ధరాత్రి తర్వాత ఇంట్లోనే చున్నీతో ఉరేశాడు. కుటుంబసభ్యులు ఫిర్యాదు మేరకు పోలీసులు వచ్చి చూడగా, కన్న కొడుకే హత్య చేసినట్లు తేలింది. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇలా వచ్చారు.. అలా వెళ్లారు!

- ఉదయం 11గంటలకే పాఠశాలకు తాళం
- విద్యార్థులు లేక తాళం వేశానన్న హెచ్.ఎం.
- విచారణ చేయిస్తామన్న డీఈవో

కంది, ఆగస్టు 9 : మండలంలోని బ్యాతోల్ గ్రామ ప్రాథమిక పాఠశాలకు శుక్రవారం ఉదయం 11 గంటలకే తాళం పడింది. విద్యార్థులు రాలేదన్న కారణంతో ప్రధానోపాధ్యాయుడు కూడా వెంటనే పాఠశాలకు తాళం వేసి బయటకు వెళ్లిపోయారు. బ్యాతోల్ ప్రాథమిక పాఠశాలలో ఐదు తరగతుల్లో మొత్తం 15 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరికి పాఠ్యాంశాలు బోధించడానికి ఒక హెచ్‌ఎంతో పాటు ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారు. ఇద్దరు ఉపాధ్యాయుల్లో ఇటీవల ఒకరిని కందికి బదిలీ చేసినట్లు తెలిసింది. మిగిలిన ఒకరు సెలవు పెట్టడంతో పాఠశాలకు వచ్చిన హెచ్‌ఎం కూడా అలా వచ్చి ఇలా వెళ్లారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. సంగారెడ్డి జిల్లా కేంద్రానికి 12 కిలోమీటర్ల దూరంలోనే ఉన్న బడికే ఇలా తాళం వేస్తే, మారుమాల గ్రామాల్లోని పాఠశాలల్లో బోధన ఎలా సాగుతుందో అర్థం చేసుకోవచ్చు. ఇదే విషయమై పాఠశాల హెచ్‌ఎం తుల్జారాంను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా శుక్రవారం విద్యార్థులు ఎవరూ రాలేదని, తనకు రావలసిన గత నెల వేతనాన్ని తెచ్చుకోవడానికి ట్రెజరీకి వెళ్లానని, అందుకే పాఠశాలకు తాళం వేసినట్లు తెలిపారు. ఈ విషయాన్ని డీఈవో వెంకటేశ్వర్లు దృష్టికి తీసుకెళ్లగా బ్యాతోల్ పాఠశాల హెచ్‌ఎం తనకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదని, విద్యార్థులు లేకున్నా పాఠశాల తెరిచే ఉంచాలని చెప్పారు. ఈ విషయమై తాను విచారణ చేయిస్తానని పేర్కొన్నారు.



బ్యాతోల్‌లో తాళం వేసి ఉన్న ప్రాథమిక పాఠశాల

అంబర్‌పేటలో దొంగల హల్‌చల్

- తాళం వేసిన 10 ఇళ్లలో చోరీ

వర్గల్, ఆగస్టు 9 : మండలంలోని అంబర్‌పేటలో దొంగలు హల్‌చల్ సృష్టించారు. తాళం వేసిన పది ఇళ్లల్లో శుక్రవారం తెల్లవారుజామున చోరీ చేశారు. గౌరారం ఎస్ఐ కరుణకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. అంబర్‌పేట గ్రామానికి చెందిన మన్నే స్వామి ఇంటి తాళం ధ్వంసం చేసి బీరువాలో ఉన్న రెండు తులాల బంగారు ఆభరణాలు, 40 తులాల వెండి వస్తువులు, రూ.20 వేల నగదు దోచుకెళ్లారు. మన్నే రమేశ్ ఇంట్లో నుంచి 50 తులాల వెండి వస్తువులు, రూ.40 వేల నగదు ఎత్తుకెళ్లారు. అలాగే కోడపర్తి ప్రకాశ్, ఇంద్రసేనరెడ్డి, కుమార్ ఇళ్లల్లో చొరబడి తులం బంగారం, 30 తులాల వెండి వస్తువులు, రూ.10 వేల నగదు చోరీ చేశారు. మరో ఐదు ఇళ్ల తాళాలను ధ్వంసం చేసి బీరువాలలో ఉన్న దుస్తులను చిందరవందర చేశారు. మొత్తం పది ఇళ్లల్లో మూడు తులాల బంగారు ఆభరణాలు, 120 తులాల వెండి, రూ.70 వేల నగదును అపహరించారని ఎస్ఐ వివరించారు. గ్రామంలోని సీసీ ఫుటేజ్ సేకరించి దొంగలను పట్టుకుంటామని తెలిపారు. సంఘటన స్థలాలను గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి పరిశీలించారు.


ఓ ఇంట్లో దొంగలు తెరిచిన బీరువా

తండ్రి హత్యలో కొడుకే సూత్రధారి

- సహకరించిన మరో ముగ్గురు అరెస్ట్

కోహెడ, ఆగస్టు 9 : మండలంలో వరుకోలు గ్రామంలో ఈనెల 7న హత్యకు గురైన ఎండీ ఫకీర్‌నబీ(45) హత్య కేసులో నలుగురు నిందితులను అరెస్టు చేసినట్లు హుస్నాబాద్ సీఐ శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. కోహెడ పోలీస్‌స్టేషన్‌లో రెండు రోజుల్లోనే హత్య కేసును ఛేదించామని, వివరాలను వెల్లడించారు. పోలీసులు మొదటగా గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేసినట్లు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేశారు. విచారణలో ఫకీర్‌నబీ కొడుకు జావిద్ ప్రధాన సూత్రధారుడు అని తేలింది. ఫకీర్‌నబీ పదేళ్ల నుంచి మద్యానికి బానిసై తన భార్యను కొడుతూ నానా బూతులు తిడుతూ వేధింపులకు గురిచేసేవాడు. నెల రోజుల క్రితం వారు ఉంటున్న హైదరాబాద్‌లోని బాలాజీనగర్ నుంచి తన భార్యను కొట్టుకుంటూ వరుకోలు గ్రామానికి తీసుకువచ్చారు. ఫకీర్‌నబీ తన భార్యను చంపడానికి ప్రయత్నించగా ఆమె తప్పించుకొని కూరెళ్ల గ్రామంలోని తల్లిగారింటిలో తలదాచుకున్నది. అప్పటి నుంచి ఫకీర్‌నబీ తన భార్యను చంపాలని ఉద్దేశంతో ఆమె కోసం వెతుకుతున్నాడు. అదే క్రమంలో ఈనెల ఆరో తేదీన అర్ధరాత్రి 12 గంటల సమయంలో ఫకీర్‌నబీ తన కొడుకు జావేద్, బంధువుల ఇంటికి వెళ్లి భార్య గురించి వెతుకుతూ గొడవపడ్డాడు. జావిద్‌తో పాటు బామ్మర్ది హజీబాబా, బంధువైన ముస్తఫా అక్కడికి చేరుకుని ఎందుకు గొడవ పడుతున్నావు అని అడగగా ఫకీర్‌నబీ తన కొడుకు జావేద్‌ను నానా బూతులు తిట్టి, కొట్టడానికి ప్రయత్నించాడు. కోపానికి గురైన జావేద్ తన తండ్రి నబీని కొట్టగా కిందపడి స్పృహ కోల్పోయాడు. పూల వ్యాపారం చేసుకునే అంకుష్ స్పృహ కోల్పోయిన నబీని ఆటోలో వరుకోలు గ్రామానికి తీసుకువచ్చారు. గ్రామ శివారులోని ఈద్గా దగ్గరికి తీసుకువచ్చి ఆటోలో నుంచి దించి ముగ్గురు కలిసి బండరాలతో కొట్టడంతో మృతుడు అక్కడికక్కడే చనిపోయాడు. హత్యానంతరం ఇదే మండలంలోని కూరెళ్ల గ్రామానికి వెళ్లి తలదాచుకున్నారు. శుక్రవారం వారిని అరెస్ట్ చేశారు. విచారణలో తన తండ్రిని చంపినట్లు ఒప్పుకోవడంతో జావిద్‌తో పాటు మరో ముగ్గురిని అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరచామని సీఐ పేర్కొన్నారు. హత్య కేసును త్వరితగతిన ఛేదించిన ఎస్ఐ సీహెచ్ తిరుపతి, పోలీస్ సిబ్బందిని ఆయన అభినందించారు.


నలుగురు నిందితులను చూపుతున్న సీఐ శ్రీనివాస్

పటాన్‌చెరు నియోజకవర్గం పరిధిలో 11 బోధకాల పాజిటివ్ కేసులు

పటాన్‌చెరు, ఆగస్టు 9 : పటాన్‌చెరు నియోజకవర్గంలో పలు గ్రామాల్లో రక్తపరీక్షలు నిర్వహించగా 11 బోధకాల కేసులు పాజిటివ్ నమోదు అయ్యాయని పటాన్‌చెరు ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ అనీసాసత్రీన్ శుక్రవారం తెలిపారు. బోధకాల నివారణకు కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈ నెల 10వ తేదీ నుంచి 25వ తేదీ వరకు పదిహేను రోజుల పాటు మందుల పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. రెండు సంవత్సరాలపైబడిన వారికి ముందు జాగ్రత్తగా ఐవర్‌మెక్టిన్ మందులు వేయాలన్నారు. గ్రామాలు, పట్టణాల్లో ఆశావర్కర్లు, హెల్త్‌సెంటర్లలో మందులు అందుబాటులో ఉంటాయన్నారు. బోధకాల వ్యాధికి కారణమైన ఎలిఫెంటాసిస్‌ను తరిమి కొట్టాలన్నారు. అయితే, రక్తపరీక్షలు నిర్వహించగా 11 మందికి బోధకాల పాజిటివ్ నమోదు కావడం ఆందోళన కలిగిస్తోందన్నారు. నివారణ తప్ప నయం కాని వ్యాధిని మందుల ద్వారా నిరోధించాలన్నారు. పరిసరాల్లో దోమలు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె సూచించారు.

పార్ట్‌టైం జాబ్ పేరిట రూ.6.50 లక్షలు టోకరా

తూప్రాన్, ఆగస్టు 9: ఆన్‌లైన్ పార్ట్‌టైం జాబ్ పేరిట పెట్టుబడులు పెట్టించుకుని సైబర్ నేరగాళ్లు రూ.6.50 లక్షలు కాజేసిన సంఘటన తూప్రాన్ మండలంలో చోటు చేసుకున్నది. ఎస్ఐ శివానందం కథనం ప్రకారం.. మండలానికి చెందిన వ్యక్తి మొబైల్‌లో టెలిగ్రామ్ అకౌంట్‌లో షైబెల్ కోర్స్ 2185 గ్రూపులో జాయిన్ అయ్యాడు. ఆన్‌లైన్ పార్ట్‌టైం జాబ్ కింద ప్రొడక్టు బిజినెస్ అంటూ ఒక లింక్ పంపించారు. ఆ లింక్ ఓపెన్ చేసి అడిగిన సమాచారం పొందుపర్చాడు. గతనెలలో రూ.10వేలు, రూ.21,423 పెట్టుబడి పెట్టగా లాభం చూపించారు. నమ్మకం కలగడంతో పలు దఫాలుగా రూ.6.50 లక్షలు పెట్టుబడి పెట్టాడు. ఈనెల 6న ఆన్‌లైన్ గ్రూపు అకౌంట్‌లో రూ.10 లక్షలు లాభం చూపించాడు. వాటిని విత్‌డ్రా చేసుకోడానికి ప్రయత్నించగా రాలేదు. టెలిగ్రామ్ గ్రూపును సంప్రదించగా రూ.5 లక్షలు పంపిస్తే డబ్బు డ్రా చేసుకోడానికి వీలవుతుందని వివరించారు. దాంతో రూ.6.50 లక్షలు మోసం పోయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

గౌరవెల్లి ప్రాజెక్టు కట్టపై సీసీ కెమెరాలు మాయం


రాడ్‌పై కనిపించని సీసీ కెమెరా

అక్కన్నపేట, ఆగస్టు 8 : ఎన్జీటీని ఆదేశాల మేరకు గుడాటిపల్లి వద్ద నిర్మిస్తున్న గౌరవెల్లి ప్రాజెక్టు కట్టపై జీఆర్ఎంబీ అధికారులు 12 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఇందులో నుంచి 4 సీసీ కెమెరాలు మాయం అయ్యాయి. గౌరవెల్లి నుంచి బంజారాహిల్స్ తండా సైడ్ ఉన్న సీసీ కెమెరాలు కనిపించడం లేదు. ఎవరైనా ఎత్తుకెళ్లారా..? లేదా కావాలనే తీశారా..? అనే అనుమానాలను ప్రాజెక్టు భూ నిర్వాసితులు వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు, ఇరిగేషన్ శాఖల అధికారులు పరిశీలించాల్సిందిగా వారు కోరుతున్నారు.

గంబూషియా చేపలతో దోమల నివారణ

సంగారెడ్డి జిల్లా మత్స్యశాఖ అధికారి సుధాకర్



కోహీర్ ఆగస్టు 9 : గంబూషియా(దోమ చేప)లతో దోమల లార్వాను నివారించడం సాధ్యపడుతుందని జిల్లా మత్స్యశాఖ అధికారి తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని కవేలి, ఖానాపూర్, కోహీర్ గ్రామాల్లో మురుగునీరు ఎక్కువగా నిలిచి ఉన్న చోట గంబూషియా చేపలను వదిలారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మురుగు కాలువల్లో దోమ చేపలను వదలడం వల్ల దోమల నియంత్రణ కావడమే కాకుండా ప్రాణాంతకమైన వ్యాధుల నుంచి దూరమవుతాయని పేర్కొన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు, జ్వరాలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో భారతి, పంచాయతీ కార్యదర్శులు, మాజీ సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

ఐఐటీహెచ్‌లో 18న ఫ్యూచర్ ఇన్వెంటర్స్ ఫెయిర్

పాఠశాల విద్యార్థుల సాంకేతిక పాజెక్టుల ప్రదర్శన

కంది, ఆగస్టు 9: పాఠశాల విద్యార్థులను ఆవిష్కరణల వైపు ప్రోత్సాహించడమే లక్ష్యంగా 'ఫ్యూచర్ ఇన్వెంటర్స్ ఫెయిర్' పేరిట ఐఐటీ-హైదరాబాద్ గత సంవత్సరం నుంచి ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది. ఈ నెల 18న రెండో ఎడిషన్ ప్రారంభం కానున్నదని ఐఐటీహెచ్ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 8 నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులు సాంకేతిక పురోగతి, సృజనాత్మకత వనరుల వంటి విభిన్న ప్రాజెక్ట్‌లను, సరికొత్త ఆలోచనలతో కూడిన ఆవిష్కరణలను ఐఐటీహెచ్‌లో ప్రదర్శించనున్నారు. గతేడాది రాష్ట్రవ్యాప్తంగా 22 పాఠశాలలు ఈ పోటీలో పాల్గొన్నాయి. ఇంటర్న్‌షిప్‌ఎల ద్వారా పాఠశాలస్థాయి విద్యార్థులు వారి అభ్యాసం మరింత పెంచుకోవడానికి ఐఐటీ-హెచ్ శాస్త్రవేత్తలు, పరిశోధకులు, నిపుణులతో సన్నిహితంగా పనిచేయడానికి ఈ ఫ్యూచర్ ఇన్వెంటర్స్ అపూర్వ అవకాశం. విజేతలకు మొదటి బహుమతి కింద రూ.29 వేలు, రెండో బహుమతి రూ.10 వేలు, మూడో బహుమతి రూ.5 వేలు అందజేయనున్నట్లు ఐఐటీహెచ్ అధికారులు వెల్లడించారు.

సెట్విన్ వ్యవస్థను బలోపేతానికి కృషి

- మంత్రులు దామోదర్ రాజనర్సింహ, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- సెట్విన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన గిరిధర్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎన్. గిరిధర్‌రెడ్డి

జహీరాబాద్, ఆగస్టు 9: సెట్విన్ వ్యవస్థను బలోపేతం చేసే దిశగా తమ ప్రభుత్వం కృషి చేస్తున్నదని మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. సెట్విన్ (సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ ప్రమోషన్, ట్రైనింగ్ ట్విన్ సిటీస్) కార్పొరేషన్ చైర్మన్‌గా ఎన్.గిరిధర్‌రెడ్డి శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. దివంగత ముఖ్యమంత్రి చెన్నారెడ్డి నేతృత్వంలో 1978లో హైదరాబాద్‌లో సెట్విన్ వ్యవస్థను ఏర్పాటు చేశారన్నారు. సెట్విన్ సేవలను కేవలం జంట నగరాలకే కాకుండ గ్రామీణ ప్రాంతాలకు విస్తరించేలా చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని 24 కేంద్రాల్లో ఏటా 25 వేల పైచిలుకు యువతకు వివిధ రంగాల్లో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన ఎన్.గిరిధర్‌రెడ్డి మాట్లాడుతూ సెట్విన్ వ్యవస్థను బలోపేతం చేసేదిశగా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సెట్విన్ ఎండీ వేణుగోపాలరావు, సీనియర్ నాయకులు సిద్ధం ఉజ్వల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగపంచమి

శ్రావణమాసంలో వచ్చే తొలి పండుగ అయిన నాగులపంచమి వేడుకలను పురస్కరించుకుని శుక్రవారం సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లోని శైవాలయాలతో పాటు నాగదేవత ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఈ సందర్భంగా మహిళలు ఉదయాన్నే కొత్త వస్త్రాలు ధరించి ఆలయాల్లో పూజలు చేసి సమీపంలోని పుట్టలో పాలు పోసి తమ కుటుంబాల్లోని పిల్లాపాపలను చల్లంగా చూడాలంటూ వేడుకున్నారు. నాగదేవతకు నైవేద్యాలను సమర్పించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆడపడుచులు పుట్టవద్ద పూజ చేసిన పాలతో తమ సోదరులకు కళ్లు కడిగి హారతులిచ్చారు. ఈ సందర్భంగా పట్టణాలు, గ్రామాల్లో ఆధ్యాత్మిక సందడి చోటు చేసుకుంది.

ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్, ఆగస్టు 9


జహీరాబాద్: మహీంద్రాకాలనీలో నాగదేవతకు పూజలు చేస్తున్న మహిళలు


జహీరాబాద్ శాంతినగర్ నాగదేవత ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న జిల్లా బీజేపీ నేత గోదావరి అంజిరెడ్డి


రాయికోడ్‌లో నాగుల పుట్టవద్ద పూజలు చేస్తున్న మహిళలు


కందిలో పుట్టలో పాలు పోస్తూ పూజలు నిర్వహిస్తున్న మహిళలు


గుమ్మడిదలలోని ఎల్లమ్మ ఆలయ ఆవరణలో ఉన్న పుట్టకు పూజలు చేస్తున్న భక్తులు


నారాయణఖేడ్‌లో నాగుల పుట్ట వద్ద మహిళల పూజలు


హత్నూరలో నాగుల పుట్టకు పూజలు నిర్వహిస్తున్న మహిళలు


కల్హేర్‌లో నాగదేవతకు ప్రత్యేక పూజలు చేస్తున్న మహిళలు


మెదక్‌లోని మల్లంచెరువు కట్టపై మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి పూజలు


రేగోడు ఎల్లమ్మ ఆలయం వద్ద పుట్టలో పాలు పోస్తున్న మహిళలు


మెదక్‌లోని మల్లెంచెరువు వద్ద మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు సతీమణి వాణి పూజలు


నాగులమ్మ ఆలయం వద్ద పుట్టకు భక్తుల పూజలు


చిన్నశంకరంపేటలో పుట్టకు పూజలు


టేక్మాల్‌లో నాగదేవతల విగ్రహాల వద్ద పూజలు నిర్వహిస్తున్న మహిళలు


నిజాంపేట: పుట్టలో పాలు పోస్తున్న దృశ్యం


చిలప్‌చెడ్: జగ్గంపేటలో నల్ల పోచమ్మ గుడివద్ద పుట్టలో పాలు పోస్తున్న మహిళలు


కొల్చారంలో పుట్టల వద్ద భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తున్న మహిళలు


వెల్దుర్తిలోని పోచమ్మ ఆలయం వద్ద పుట్టలో పాలు పోస్తున్న మహిళలు

20వ సారి తిరుమలకు పాదయాత్ర


సీసాలరాజు పాదయాత్రకు వీడ్కోలు చెబుతున్న ఎమ్మెల్యే తదితరులు

పటాన్‌చెరు, ఆగస్టు 9: తిరుమల వేంకటేశ్వరస్వామి మొక్కుతీర్చుకోవడంలో భాగంగా పటాన్‌చెరుకు చెందిన తుక్కువ్యాపారి సీసాలరాజు శుక్రవారం 20వ సారి పటాన్‌చెరు నుంచి ఆధ్యాత్మిక పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు. పట్టణంలోని మహంకాళీ ఆలయం వద్ద సీసాలరాజుకు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, పట్టణ రాజకీయ నాయకులు, భక్తులు, మహిళలు పెద్ద ఎత్తున వీడ్కోలు పలికారు.

పంచాయతీలకు నిధులు విడుదల

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 9: జిల్లాలని 647 గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులను సీఎఫ్‌సీ గ్రాంటు కింద రాష్ట్ర ప్రభుత్వం రూ. 9.21 కోట్లనిధులను విడుదల చేసిందని జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కేంద్ర ఆర్థిక సంఘం సీఎఫ్‌సీ గ్రాంటు జనరల్ కంపోనెంట్ అన్ ట్రైడ్ గ్రాంట్స్ కింద విడుదల చేయడం జరిగిందని అదేవిధంగా జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలకు ఈ నిధులను జమ చే సినట్టు పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేకాధికారులు ఈ నిధులను 15 ఆర్థిక సంఘం నిబంధనల మేరకు వినియోగించాలన్నారు.

విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు

వట్‌పల్లి, ఆగస్టు 9: ఉద్యోగులు విధుల పట్ల అలసత్వం వహిస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని సంగారెడ్డి డీపీవో సాయిబాబా అన్నారు. శుక్రవారం మేడుకుందా శివారులో వట్‌పల్లిలో ఫ్రైడే-డ్రైడే కార్యక్రమంలో పాల్గొన్నారు అనంతరం వట్‌పల్లిలో ఆస్పత్రి కోసం ఎంపిక చేసిన స్థలాన్ని పరిశీలించారు వట్‌పల్లిలోని పలువాడల్లో డీపీవో పర్యటించి పరిసరాలను పరిశీలించి గృహాల వద్ద చెత్తా చెదారం పడిఉండటాన్ని గమనించి పంచాయతీ కార్యదర్శి రమేష్ పై ఆగ్రహం వ్యక్తం చేశారు.

సమీకృత హాస్టల్, జ్యోతిబాపూలే పాఠశాలల తనిఖీ


ఖేడ్‌లోని సమీకృత హాస్టల్‌లో వివరాలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

నారాయణఖేడ్, ఆగస్టు 9:నారాయణఖేడ్ పట్టణంలోని సమీకృతా హస్టల్ భవనంతో పాటు పట్టణ శివార్లలోని జ్యోతిబాపూలే పాఠశాలను శుక్రవారం జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడి సమస్యలను తెలుసుకున్నారు. మెనూ ప్రకారం బోజనాలు పెడుతున్నారా.. లేదా? అని విద్యార్థులను అడిగితెలుసుకున్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు తనిఖీ చేసినట్లు ఆయన తెలిపారు. విద్యార్థులకు ఏవైనా సమస్యలు ఉంటే తమకు నేరుగా తెలుపవచ్చని, అదనపు కలెక్టర్ తెలిపారు. ఆయన వెంట ఆర్డీవో అశోక చక్రవర్తి, మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, వైస్ చైర్మన్ దారం శంకర్, దారం శంకర్, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, కౌన్సిలర్ వివేకానంద్, హాస్టల్‌సిబ్బందిపాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు దుస్తుల పంపిణీ

నారాయణఖేడ్ మున్సిపల్‌కార్యాలయ సిబ్బందికి శుక్రవారం జిల్లా లోకల్ బాడీస్ అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ దుస్తులు పంపిణీ చేశారు. 15వ ఆగస్టును పురస్కరించుకొని ముందుగానే మున్సిపల్ కార్మికులకు దుస్తులను పంపిణీ చేసినట్లు మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, కమిషనర్ జగ్జీవన్‌లు తెలిపారు.

ధ్వంసమైన రోడ్డును బాగుచేయించిన ఎన్‌ఆర్‌ఐ

కల్హేర్, ఆగస్టు 9: కొన్నేళ్లుగా రహదారికి మరమ్మతులు లేక పూర్తిగా ధ్వంసమైన రోడ్డును మార్డి గ్రామానికి చెందిన ఎస్‌ఆర్‌ఐ గుర్రపు మచ్చేందర్ శుక్రవారం మరమ్మతులు చేయించారు. మాసాన్‌పల్లి చౌరస్తా నుంచి వయా సిర్గాపూర్ మీదుగా నారాయణఖేడ్‌కు వెళ్లే రహదారిపై మండల కేంద్రమైన కల్హేర్ నుంచి మార్డి గ్రామం వరకు ఉన్న బీ రహదారి పూర్తిగా అధ్వాన్న స్థితికి చేరుకుని ప్రయాణానికి వీలు లేకుండా మారింది. దీంతో ప్రజల అవస్థలు గమనించి ఎన్‌ఆర్‌ఐ మచ్చేందర్ కంకరతో రూ.2.50 లక్షల విలువైన మరమ్మతు పనులు ప్రారంభించారు. తాను పుట్టిన ఊరు కోసం తన సొంత డబ్బులతో రోడ్డు మరమ్మతులు చేయించిన గుర్రపు మచ్చేందర్ సేవలను స్థానికులు కొనియాడారు. ఈ మరమ్మతు పనుల్లో గుర్రపు మచ్చేందర్ ఫౌండేషన్ బాధ్యులు జలందర్, శ్రీనివాస్, బస్వరాజ్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

జిన్నారంలో యువజన కాంగ్రెస్ ఆవిర్భావ వేడుకలు

జిన్నారం, ఆగస్టు 9: మండల కేంద్రమైన జిన్నారంలో యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం పార్టీ మండల కార్యాలయం ఆవరణలో యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు నరేందర్‌గౌడ్ జెండా అవిష్కరించారు. పార్టీలో యువజన కాంగ్రెస్ శ్రేణుల కీలక పాత్ర వహించాలని, ప్రభుత్వ పథకాల అమలు, లబ్ధిదారులకు చేరేలా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో వివిధగ్రామాల యువజన నాయకులు పాల్గొన్నారు.

విరబూసిన బ్రహ్మకమలాలు

- నారాయణఖేడ్‌లో ఒకే ఇంట్లో 15


నారాయణఖేడ్‌లో వికసించిన బ్రహ్మకమలాలు

నారాయణఖేడ్/ సంగారెడ్డి అర్బన్/ హవేళిఘణపూర్, ఆగస్టు 9: చాలా అరుదుగా మాత్రమే పూసే బ్రహ్మకమలాలు శ్రావణ శుక్రవారం చూపరులకు కనువిందు చేశాయి. శుక్రవారం తెల్లవారు జామున నారాయణఖేడ్ ఎట్టణానికి చెందిన తానాజీ, సునీత గృహంలో ఒకేసారి 15 బ్రహ్మకమలాలు వికసించాయి. దీంతో ఆ దంపతులు పుష్పాలకు ప్రత్యేక పూజలు చేశారు. కాగా నారాయణఖేడ్ పట్టణానికి చెందిన బాణాపురం శ్రీవాణి, రాజు ఇంట్లో సైతం ఆరు పుష్పాలు వికసించాయి. కాగా తెలుగు ఉపాధ్యాయులు వడ్ల రాజయ్య, పద్మల గృహంలోను బ్రహ్మ కమలాలు పూసాయి. ఆయా కుటుంబాలకు చెందిన వారు ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం తమ ఇంట్లో పూయడం అదృష్టంగా భావిస్తున్నట్టు తెలిపారు. సంగారెడ్డి పట్టణంలోని శాంతినగర్‌లోని తెలంగాణ మైనార్టీ వెల్ఫేర్ జిల్లా కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న రాజశేఖర్ ఇంట్లో 8 బ్రహ్మ కమలాలు పూశాయి. హవేళిఘణపూర్ మండలంలోని తొగిట గ్రామంలో తూముకుంట ప్రవీణ్ కుమార్ తన ఇంట్లో మూడేళ్ల క్రితం నాటిని మొక్కకు శుక్రవారం బ్రహ్మ కమలం వికసించింది.

నేడు అమీన్‌పూర్‌లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

పటాన్‌చెరు, ఆగస్టు 9: రామచంద్రాపురం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు నిర్వహిస్తున్నందున శనివారం ఉదయం 8 నుంచి 11గంటల వరకు అమీన్‌పూర్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఏఈ వెంకట్‌రాంరెడ్డి పేర్కొన్నారు. మున్సిపల్ పరిధిలోని ప్రజలు సిబ్బందికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

భవిష్యత్ తరాల కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టి స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం ముగింపు రోజైన శుక్రవారం మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో ముమ్మరంగా కొనసాగింది. అధికారులు, సిబ్బంది ఇంటింటికి తిరుగుతూ పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.


మెదక్‌లోని మాధవనగర్‌కాలనీలో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు, మున్సిపల్ పాలకవర్గం


మునిపల్లి: హైద్లాపూర్‌లో మొక్క నాటి నీరు పోస్తున్న ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రామాచారి

మెదక్‌మున్సిపాలిటీ/నర్సాపూర్/కొల్చారం/అల్లాదుర్గం/చిలప్‌చెడ్/హవేళీఘనపూర్/ చేగుంట/వెల్దుర్తి/ మనోహరాబాద్/చిన్నశంకరంపేట/రేగోడు/పెద్దశంకరం పేట/ , ఆగస్టు 9: భవిష్యత్ తరాలను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఎమ్మెల్యే రోహిత్‌రావు పిలుపునిచ్చారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం ముగింపు రోజైన శుక్రవారం మెదక్ మున్సిపల్ పరిధిలోని 12వవార్డు మాధవనగర్ కాలనీలో ఎమ్మెల్యే పాల్గొని మొక్కలు నాటారు. నర్సాపూర్‌లో మండలంలోని ఆవంచ గ్రామంలో నిర్వహించిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ, నర్సాపూర్ మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్‌రావు ఎంపీడీవో మధులతతో కలిసి పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా పరిశుభ్రత- పచ్చదనంపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక అధికారులు, నాయకులు పాల్గొన్నారు. మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, కమిషనర్ జైతురాంనాయక్ ఆధ్వర్యంలో నర్సాపూర్‌లో ఇంటింటికీ మొక్కలను పంపిణీ చేశారు. కొల్చారంలో సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలో ఎమ్మెల్యే సునితాలక్ష్మారెడ్డి విద్యార్థినులతో కలిసి పాఠశాల ఆవరణలో మొక్కలను నాటి నీళ్లు పోశారు. అల్లాదుర్గం మండలంలోని ముస్లాపూర్ గిరిజన తండా, కాయిదంపల్లి, అప్పాజిపల్లి, నీలకంఠిపల్లి గ్రామాలలో జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య పర్యటించారు. కాయిదంపల్లిలో రైతులతో కలసి మొక్కలను నాటారు. చిలప్‌చెడ్ మండలం అంతారం గ్రామంలో ఎంపీడీవో ఆనంద్ ఆధ్వర్యంలో వేయి మొక్కలను నాటారు. వెంట ఎంపీవో శరత్‌కుమార్‌రెడ్డి, తదితరులు ఉన్నారు. హవేళిఘణపూర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి విజయలక్ష్మి పాల్గొని మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీవో రవీశ్వర్‌గౌడ్, ఇతర అధికారులు పాల్గొన్నారు. చేగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అవరణలో తూప్రాన్ డీఎల్పీవో, మండల ప్రత్యేక అధికారి యాదయ్య ఇతర అధికారులతో కలసి మొక్కలు నాటారు. పీహెచ్‌సీ వద్ద వందకు పైగా మొక్కలు నాటినట్లు ఆయన తెలిపారు. వెల్దుర్తి మండలం మంగళపర్తి గ్రామంలో ఎంపీడీవో ఉమాదేవి పర్యటించి సీజనల్ వ్యాధులపై, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, గ్రామస్థులతో కలిసి మొక్కలు నాటారు. మనోహరాబాద్ మండల కేంద్రంలో నిర్వహించిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి. 44వ జాతీయ రహదారి పక్కన మొక్కలు నాటారు. అలాగే ధర్మరాజుపల్లి, మనోహరాబాద్ గ్రామాల్లో ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. చిన్నశంకరంపేట మండలంలోని వివిధ గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు మొక్కలు నాటారు. రేగోడు మండలంలోని మర్పల్లి గ్రామంలో స్థానిక అధికారులు నాయకులతో మొక్కలు నాటారు. పెద్దశంకరంపేటలోని పలు ప్రాంతాల్లో మండల తహసీల్దార్ గ్రేస్‌బాయ్, ఎంపీడీవో రఫీక్ ఉన్నిసా తదితర అధికారులు మొక్కలను నాటారు.

సంగారెడ్డి జిల్లాలో..

కొండాపూర్/ మునిపల్లి/కంది/ కల్హేర్/ హత్నూర/ జహీరాబాద్, ఆగస్టు 9: స్వచ్ఛదనం. పచ్చదనం కార్యక్రమంలో భాగంగా జిల్లా వైద్యాధికారి గాయత్రిదేవి మల్లెపల్లిలో ఇంటింటికీ తిరిగి ఆరోగ్య సమస్యలు, ఇంటి పరిశుభ్రతను పరిశీలించారు. ఆమె వెంట డాక్టర్ సుకీర్తన, సీహెవో లక్ష్మీనారాయణ, ఏఎన్ఎం లక్ష్మి, వైద్య సిబ్బంది ఉన్నారు. మునిపల్లి మండల పరిధిలోని హైద్లాపూర్, చిన్నచెల్మెడ తదితర గ్రామాల్లో స్వచ్ఛదనం.. పచ్చదనం కార్యక్రమాన్ని నిర్వహించారు. హైద్లాపూర్ గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ, మండల స్పెషలాఫీసర్ రామాచారి పాల్గొని పారిశుధ్య పనులపై ప్రజలకు అవగాహన కల్పించారు. మొక్కలు నాటి నీరు పోశారు. కంది మైనార్టీ గురుకుల పాఠశాలలో మండల ప్రత్యేక అధికారి లలితకుమారితో పాటు మండల పంచాయతీ అధికారులు, పాఠశాల సిబ్బందితో కలిసి పాఠశాల ఆవరణ మొత్తం శుభ్రం చేయించారు. పిచ్చిమొక్కలు, చెత్తా చెదారాన్ని తొలగించారు. కల్హేర్ మండల పరిధిలోని మహదేవ్‌పల్లి గ్రామంలో స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొని మొక్కలు నాటారు. హత్నూర మండల కేంద్రంతో పాటు గోవింద్రాజ్‌పల్లి, సిరిపురం, గ్రామాల్లో డిప్యూటీ సీఈవో స్వప్న పాల్గొని మొక్కలు నాటారు. సీజనల్ వ్యాధులు రాకుండా ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. జహీరాబాద్ మండలం శేఖాపూర్, అల్గోల్ తదితర గ్రామాల్లో డివిజనల్ పంచాయతీ అధికారి అమృత, తహసీల్దార్ రవీందర్, ఎంపీడీవో మహేందర్‌రెడ్డి పర్యటించి ప్రజల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. నారాయణఖేడ్ ఏరియా వైద్యశాల ఆవరణలో శుక్రవారం పారిశుధ్య కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ రమేష్ ఆధ్వర్యంలో సిబ్బంది ఆస్పత్రి పరిసరాలను శుభ్రం చేశారు.

జీడిపల్లిలో తాళం వేసిన ఇంట్లో చోరీ

మనోహరాబాద్, ఆగస్టు 9: జీడిపల్లి గ్రామంలో గత 10 రోజుల్లోపే రెండు చోరీలు జరిగాయి. ఎస్ఐ సుభాష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని జీడిపల్లి గ్రామానికి చెందిన గుండా ఉమా భర్త శ్రీనివాస్ కుటుంబంతో కలసి గురువారం ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లారు. శుక్రవారం ఉదయం వచ్చి చూడగా తాళం ధ్వంసమై ఉంది. అనుమానంతో లోనికి వెళ్లి పరిశీలించగా 60 తులాల వెండి, పావుతులం బంగారం చోరీకి గురైనట్టు బాధితులు శ్రీనివాస్ ఉమా దంపతులు తెలిపారు.

రామాయంపేటలో మూడు చోట్ల దొంగతనాలు

రామాయంపేట, ఆగస్టు 9: పట్టణంలో దొంగలు వ్యాపార సంస్థలే కాదు. గుళ్లనూ వదలటం లేదు. తాజాగా గురువారం అర్ధరాత్రి మొదట ఓ సిమెంట్ షాపులో జొరబడి గల్లపెట్టె లోని 80 వేల నగలు దోచుకున్నారు. అనంతరం గ్రానైట్‌షాప్, ఎంఆర్ చాయ్ దుకాణాల తాళాలు పగులగొట్టి రూ.వెయ్యి ఎత్తుకెళ్లారు. చివరగా బైపాస్‌లోని శివాలయం గర్భగుడి తలుపులు బద్దలు కొట్టారు.

శివంపేట పంచాయతీ కార్యదర్శికి షోకాజ్ నోటీస్

పుల్‌కల్, ఆగస్టు 9: చౌటకూర్ మండలం శివంపేట గ్రామాన్ని జిల్లా పంచాయతీ అధికారి టీ.సాయిబాబా శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. ఫ్రైడే-డ్రైడే కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించడం లేదంటూ పంచాయతీ కార్యదర్శి సామల వేణుగోపాల్‌పై డీపీవో ఆగ్రహం వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో అలసత్వం వహించినందుకు పంచాయతీ కార్యదర్శి సామల వేణుగోపాల్‌కు షోకాజ్ నోటీసును జారీ చేశారు. కార్యక్రమంలో ఎంపీఈవో శ్రీకాంత్‌గౌడ్, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్న నిర్మలాజగ్గారెడ్డి


హైదరాబాద్ చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్న నిర్మలాజగ్గారెడ్డి

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 9 : శ్రావణమాసం సందర్భంగా హైదరాబాద్ చార్మినార్‌లోని భాగ్యలక్ష్మి అమ్మవారిని శుక్రవారం టీజీఐఐసీ చైర్ పర్సన్, సంగారెడ్డి డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి చిన్న ముదిరాజ్, శ్రీనివాస్, సాయికుమార్, నితీష్, గాలయ్య, విజయ్, మల్లేశ్, భువన్, నాగేంద్ర, ఈశ్వర్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

'ఓపెన్' సర్టిఫికెట్ రెగ్యులర్‌తో సమానం: డీఈవో

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 9 : ఓపెన్ సర్టిఫికేట్ రెగ్యులర్‌తో సమానమని డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. సంగారెడ్డిలోని స్థానిక కార్యాలయంలో శుక్రవారం ఓపెన్ స్కూల్ అడ్మిషన్స్‌కు సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ఓపెన్ పదో తరగతి, ఇంటర్‌లో ప్రవేశాలకు ఈ నెల 10వ తేదీ నుంచి అడ్మిషన్ పొందవచ్చని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు ఓపెన్ స్కూల్ అధ్యయన కేంద్రాలను సంప్రదించి అడ్మిషన్ పొందాలని సూచించారు.

రెసిడెన్షియల్ స్కూళ్ల టైమ్ టేబుల్‌ను సవరించండి

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 9 : రెసిడెన్షియల్ స్కూళ్ల టైమ్ టేబుల్‌ను సవరించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సాయిలు డిమాండ్ చేశారు. సంగారెడ్డిలోని సంఘం కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేజీబీవీల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు బేసిక్ పే ఇవ్వాలన్నారు. మైనార్టీ రెసిడెన్షియల్, మహాత్మ జ్యోతిరావుపూలే రెసిడెన్షియల్, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఇతర గురుకులాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ఉద్యోగులకు ఉచిత వైద్యం కల్పించేందుకు హెల్త్ కార్డులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యూటీఎఫ్ కోశాధికారి శ్రీనివాస్‌రావు, నరేందర్, ధన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలు వెంటనే ప్రకటించాలి: తపస్



మాట్లాడుతున్న తపస్ రాష్ట్ర సహకోశాధికారి భాస్కర్‌దేశ్

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 9 : పెండింగ్ డీఏలు వెంటనే ప్రకటించాలని టీపీయూఎస్(తపస్) రాష్ట్ర సహ కోశాధికారి భాస్కర్‌దేశ్ డిమాండ్ చేశారు. సంగారెడ్డిలోని మాధవసదన్‌లో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా కోర్ కమిటీ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త ప్రభుత్వం ఏర్పడి 8 నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు ఒక్క డీఏ కూడా ప్రకటించకపోవడం శోచనీయమన్నారు. ఐదు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, కనీసం నాలుగు డీఏలు వెంటనే మంజూరు చేయాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు దత్తాత్రి మాట్లాడుతూ గురుకులాల సమయ వేళను మార్చి 9 గంటలకు ప్రారంభమయ్యే విధంగా చూడాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అడివప్ప, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు బస్వరాజు, జిల్లా నాయకులు నర్సింలు, రాములు తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్‌లో స్పాట్ అడ్మిషన్‌లకు దరఖాస్తుల ఆహ్వానం

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 9 : పాలిటెక్నిక్‌లో స్పాట్ అడ్మిషన్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు సంగారెడ్డి ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ పి. జానకిదేవి తెలిపారు. సంగారెడ్డి మండలం హనుమాన్‌నగర్ గ్రామంలోని కళాశాలలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. సంగారెడ్డి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో చేరేందుకు ఈ నెల 12న స్పాట్ అడ్మిషన్లు ఇవ్వనున్నామని వెల్లడించారు. పాలిసెట్ రాసిన విద్యార్థులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వనున్నామని, వారు రాని పక్షంలో ఇతరులకు అవకాశం ఇవ్వనున్నట్టు తెలిపారు. 12వ తేదిన స్పాట్ అడ్మిషన్లకై వచ్చే విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు పాలిసెట్ 2024 ప్రవేశ పరీక్ష ర్యాంక్ కార్డు, పదవ తరగతి లేదా దానికి సమానమైన విద్యార్హత మార్కుల మెమో, టీసీ, కుల, నివాసం ధృవపత్రాలతో హాజరుకావాలని సూచించారు.

క్విట్ ఇండియా స్ఫూర్తితో కేంద్రాన్ని ప్రతిఘటిద్దాం

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 9: క్విట్ ఇండియా స్ఫూర్తితో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటిద్దామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జీ.సాయిలు, ఐఎన్‌టీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి, రైతు సంఘం జిల్లా నాయకుడు జయరాజ్, వ్యవసాయ కార్మిక సంఘం నర్సింహులు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సంగారెడ్డిలో శుక్రవారం కార్మిక సంఘాల నాయకులు ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నరేంద్రమోదీ ప్రభుత్వం అన్ని రంగాల్లో కార్పొరేట్‌లకే పెద్దపీట వేస్తున్నదన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రాజయ్య, ప్రవీణ్, బాబురావు, దత్తు, కృష్ణమూర్తి, రాజు, శివ, గోపాల్‌రెడ్డి, నర్సింలు, అలీ, రైతు సంఘం నాయకుడు శ్రీనివాస్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

'ఫైలేరియా నివారణ అందరి బాధ్యత'

గుమ్మడిదల, ఆగస్టు 9 : ఫైలేరియా వ్యాధి నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యతని, ప్రభుత్వ ఆదేశాల మేరకు నేటి నుండి ప్రతి ఇంటికి ఫైలేరియా మందులు పంపిణీకి ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం సిద్ధమైనట్లు గుమ్మడిదల ప్రభుత్వ ఆరోగ్య వైద్యాధికారి డాక్టర్ మధుకర్ తెలిపారు. శుక్రవారం గుమ్మడిదల ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో ఫైలేరియా వ్యాధి నిర్మూలనకై తీసుకోవాల్సిన జాగ్రత్తలు ప్రజలను చైతన్యపరచాల్సిన అంశాలపై అంగన్వాడీ, ఆశా వర్కర్స్, వైద్య సిబ్బందికి డాక్టర్ మధుకర్ శిక్షణా శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫైలేరియా వ్యాధి నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలపై సిబ్బందికి పూర్తిస్థాయిలో వివరించారు. ఈనెల 10వ తారీకు నుండి 15వ తారీకు వరకు గుమ్మడిదల వైద్య ఆరోగ్య కేంద్రం పరిధిలోని గ్రామాలలో విస్తృతంగా ఫైలేరియా మందులు ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు

అర్హులందరికీ రుణమాఫీ ఇవ్వకుంటే కలెక్టరేట్ల ముట్టడి

పాపన్నపేట, ఆగస్టు 9: అర్హులైన రైతులందరికీ రుణమాఫీ ఇవ్వకుంటే ఆగస్టు 15 తర్వాత కలెక్టరేట్‌లను ముట్టడిస్తామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ హెచ్చరించారు. శుక్రవారం పాపన్నపేటలో కిసాన్ మోర్చా అధ్యక్షుడు బైండ్ల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన రచ్చబండ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రుణ మాఫీ పేరుతో డ్రామాలు ఆడుతుందన్నారు. అర్హులైన అనేక మంది రైతులకు మాఫీ రాలేదన్నారు. బాధిత రైతులు బ్యాంకులు, వ్యవసాయ కార్యాలయాల చుట్టు తిరుగుతున్నారని వాపోయారు. బాధితుల నుంచి వారు వినతి పత్రాలను స్వీకరించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బీకొండ రాములు, కిసాన్ మోర్చా అధ్యక్షుడు సిద్ధిరాములు, నిజాంపేట మాజీ జడ్పీటీసీ పంజా విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.